సాక్షి సంగారెడ్డి

బుధవారం ၊ 10 ၊ మే ၊ 2023



ఎమ్మెల్యే పోస్టులు పెడితే చంపుతారా?

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పోస్టులు పెడితే చంపుతామని ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిపై ఎమ్మెల్యే వర్గీయులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. 8లో



విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందరికీ నెగెటివ్ వచ్చినట్టు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేశారు.

న్యూస్‌రీల్

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధ్యాయుల బదిలీల, పదోన్నతుల షెడ్యూల్ కొనసాగించే విధంగా కోర్టు కేసును వెకెట్ చేయించాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తద్వారా తీర్చాలని కోరారు. జెడ్పీ జీపీఎఫ్, ఈఎల్ఎస్ సరెండర్, మెడికల్ తదితర సప్లిమెంటరీ బిల్లులన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, కోశాధికారి శ్రీనివాసరావు, కార్యదర్శులు అమరేశ్వరి, సాయితేజ, ఎశప్ప, శామయ్య, జగన్మోహన్ టీవీ, రామలక్ష్మి, అనురాధ, చందర్ రాథోడ్, నాయకులు విజయ్ కుమార్, ప్రభాకర్, జ్యోతి, సంతోష్‌కుమార్, కృష్ణమూర్తి, దుర్గయ్య, విట్టల్, అంజయ్య, వెంకయ్య, సాయన్న, లక్ష్మయ్య, శంకర్ రాథోడ్, బద్రుద్దీన్, కమలాకర్‌రావు, నరేందర్ పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి):పంచాయతీ కార్యదర్శులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని ఏప్రిల్ 28 నుంచి న్యాయమైన డిమాండ్‌తో సమ్మె చేస్తుంటే సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. విధుల్లో చేరకపోతే పంచాయతీ కార్యదర్శుల ను తొలగిస్తామని పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. ఈ నోటీసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పాడితోనే ప్రత్యామ్నాయ ఉపాధి



పాల సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న డెయిరీ డీడీ మోహన్‌మురళి


జోగిపేట(అందోల్): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి పొంది, విజయ డెయిరీకి పాలు విక్రయించి లాభాలు గడించాలని విజయ డెయిరీ డీడీ మోహన్‌మురళి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో విజయపాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాలకు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు పాడి పశువులను పెంచుకోవాలన్నారు. జిల్లాలో ఒక రోజుకు 25 వేల లీటర్ల పాలసేకరణ టార్గెట్ ఉండగా ప్రస్తుతం 156 పాల సేకరణ కేంద్రాల ద్వారా సుమారు 11వేల లీటర్ల పాలు సేకరిస్తున్నామన్నారు. ప్రైవేట్ డెయిరీల కంటే విజయ డెయిరీకి పాలు పోసే రైతులకు ఎక్కువ ధర చెల్లిస్తుందన్నారు. జోగిపేట బీఎంసీయూ రూట్ సూపర్‌వైజర్ ప్రభాకర్ ఆయన వెంట ఉన్నారు.

డీఈఓను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

కొండాపూర్(సంగారెడ్డి): ఇటీవలె డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును మంగళవారం టీఎస్ యూటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంగారెడ్డిలో డీఈఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఈఓను కోరారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, ఎఫ్ఏసీ అలవెన్స్, ఇతర బిల్లులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కోరారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల తోడ్పాటుతో జిల్లాలో విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్తానన్నారు.

ముందుకు.. వెనక్కి

- ఇంటర్ ద్వితీయ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 15వ స్థానం
- ప్రథమ ఫలితాల్లో 17వ స్థానం
- జిల్లాలో బాలికలదే పైచేయి



కొండాపూర్(సంగారెడ్డి): ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 58 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది 57 శాతం ఉత్తీర్ణతతో 17వ స్థానానికి పడిపోయింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మాత్రం గతేడాది కంటే కొంచెం మెరుగైన ఫలితాలు వెలువడ్డాయి. గత సంవత్సరం 64 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో 21వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ ఫలితాలలో 66 ఉత్తీర్ణత శాతంతో 15వ స్థానంలో నిలిచింది. రంజోల్‌లోని తెలంగాణ గురుకుల కళాశాల విద్యార్థి శిరీష బైపీసీ మొదటి సంవత్సరంలో 436 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఫలితాలలో ప్రైవేట్ కళాశాలలు సత్తా చాటాయి. సంగారెడ్డిలోని అక్షయ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో మనిత్వ రెడ్డి 992 మార్కులు, ఇంద్రజ 991 మార్కులు, బైపీసీలో సఫూర పిర్దౌస్ 992, ఎంఈసీ విభాగంలో మురళీకృష్ణ 981 సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో కార్తీక్ 465 మార్కులు, వంశీకృష్ణ, వివేక్‌లు 464, బైపీసీలో భగవతి 435 మార్కులు, సెయింట్ ఆంథోనీస్ కళాశాల విద్యార్థి శిల్ప ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 467, శాంభవి 466, వైశాలి 465లతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.



సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫలితాలు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రథమ సంవత్సరంలో ఇలా..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 17,658 మంది విద్యార్థులకుగాను 10,216 మంది ఉత్తీర్ణత సాధించారు.

- 7,675 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా, 3636 మంది ఉత్తీర్ణత సాధించగా, ఉత్తీర్ణత శాతం 47గా నమోదైంది.
- బాలికల విభాగంలో 9,983 మంది విద్యార్థినులకుగాను 6580 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతశాతం 65గా నమోదైంది.

ద్వితీయ సంవత్సరంలో ఇలా..

ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 13,995 మంది విద్యార్థులకుగాను 9270 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 56గా నమోదైంది.

- బాలుర విభాగంలో 5609 మంది విద్యార్థులకుగాను 3212 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 57గా నమోదైంది.
- బాలికల విభాగంలో 8386 మంది విద్యార్థినులకుగాను 6058 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 72గా నమోదైంది.

గురుకులాల్లో...

ఇంటర్ ఫలితాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు.

- ప్రథమ సంవత్సరంలో 1012 మంది విద్యార్థులకుగాను 792 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా 15 గురుకుల కళాశాలలు ఉండగా, కొండాపూర్ గురుకుల కళాశాల 98.36 ఉత్తీర్ణత శాతంతో ప్రథమస్థానంలో నిలిచింది. నారాయణఖేడ్‌లోని బాలుర గురుకుల కళాశాల 33.33 ఉత్తీర్ణత శాతంలో చివరి స్థానంలో నిలిచింది.
- ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 735 మంది విద్యార్థులకుగాను 648 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కొండాపూర్, రాయికోడ్ గురుకుల కళాశాలలు 100 శాతం, హత్నూరలో 99.29 ఉత్తీర్ణత శాతం నమోదు కాగా, అత్యల్పంగా జహీరాబాద్‌లోని బాలికల గురుకుల కళాశాల 62.5 ఉత్తీర్ణత శాతంతో చివరిస్థానంలో నిలిచింది.

ఒకేషనల్ విభాగంలో...

- ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో 1487 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 839 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గత సంవత్సరం 59శాతం ఉత్తీర్ణతో రాష్ట్రంలో 5వస్థానంలో నిలవగా, ఈ ఏడాది 56శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 12వ స్థానానికి పడిపోయింది.
- ద్వితీయ సంవత్సరంలో 1265 మంది విద్యార్థులకుగాను 928 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గతేడాది 66శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది 73 శాతం ఉత్తీర్ణతతో 10వ స్థానానికి పడిపోయింది.

చాలా సంతోషంగా ఉంది



ఇంటర్ ఫస్ట్ ఇయర్(బైపీసీ)లో 436 మార్కులు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు నిర్వహించారు.

– శిరీష, రంజోల్ గురుకుల పాఠశాల



ఝరాసంగం: ఆరోగ్య మహిళా సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ గాయత్రీదేవి

త్వరలో జిల్లావ్యాప్తంగా ఆరోగ్య మహిళ

డీఎంహెచ్ఓ గాయత్రీదేవి

ఝరాసంగం(జహీరాబాద్): ఆరోగ్య మహిళ వైద్యసేవలు త్వరలో జిల్లావ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని డీఎంహెచ్ఓ డాక్టర్ గాయత్రీదేవి అన్నారు. మంగళవారం ఝరాసంగంలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళావైద్య సేవల శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ అందుస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఝరాసంగం, జిన్నారం, ఆర్‌సీపురం, బిలాల్‌పూర్‌లో ఆరోగ్య మహిళ వైద్యసేవలు కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని ఆరోగ్య మహిళా కేంద్రాల్లో 2837 మంది ఓపీగా వచ్చారని, అందులో 175 మందికి మెరుగైన చికిత్స సంగారెడ్డిలో అందిస్తున్నామన్నారు. త్వరలో న్యూట్రీషన్ కిట్‌లు అందజేస్తామన్నారు.

కేంద్రాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ

ఆరోగ్య మహిళా కేంద్రాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ ఎల్లయ్య తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య మహిళా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లంచాలు లేవు.. కమీషన్లు అసలే లేవు

ఆత్మీయ సమ్మేళనంలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్): నాలుగేళ్ల పాలనలో లంచంగానీ, కమీమిషన్ గానీ ఆశించకుండా నియోజకవర్గప్రజలకు సేవ చేస్తున్నానని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం బస్వాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు నాలుగేళ్ల పాలనలో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా పాలన సాగించానన్నారు. గతంలో పాలకులు కమీషన్లు ఆశించి పనులు చేసేవారని గుర్తు చేశారు. ఓ ప్రజాప్రతినిధి కమీషన్ల ద్వారా వచ్చిన సంపాదనతో రాయిపాడ్ శివారులో వందల ఎకరాలు సంపాదించారని గుర్తు చేశారు. నిస్వార్థంగా సేవ చేస్తే అన్ని ఎకరాల భూమి సంపాదించే వారా న్నారు. ఆ నాయకుడు నాలుగేళ్ల తర్వాత నియోజకవర్గంలో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. తాను ఎప్పుడు అధికారుల వద్ద గానీ, ప్రజాప్రతినిదుల వద్దగానీ నయాపైసా ఆశించలేదన్నారు. కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దళితబంధులో కూడా తన బంధువులను ఎంపిక చేయలేదని గుర్తు చేశారు. మా సోదరుడు నాలుగేళ్లకు ముందు కొన్న భూములపై అక్రమణల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్యకర్తలు చిన్నచిన్న విభేదాలు పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చైతన్య విజయ్ భాస్కర్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మెన్ యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

త్రిముఖ పోరు

హుమ్నాబాద్ అసెంబ్లీ స్థానానికి బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య పోటీ		
	మొత్తం ఓట్లు	2,40,347
	పురుషులు	1,23,906
	మహిళలు	1,16,426
	ఇతరులు	15



జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న బీదర్ జిల్లాలోని హుమ్నాబాద్ అసెంబ్లీ స్థానానికి త్రిముఖ పోటీ నెలకొంది. పోలింగ్ తేదీ (ఈనెల10) దగ్గరల్లోనే ఉండడంతో అన్ని పార్టీల్లోనూ టెన్షన్ నెలకొంది. నాలుగు పర్యాయాల నుంచి వరుస విజయాలు సాధిస్తూ వస్తున్న మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్‌ను కాంగ్రెస్ మరోమారు బరిలో దింపింది. బీజేపీ నుంచి కొత్త అభ్యర్థిగా సిద్ధు పాటిల్ రంగంలోకి దిగారు. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన దగ్గరి బంధువులు కావడంతో పోటీ రసవత్తంగా మారింది. జేడీఎస్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి సీఎం. ఇబ్రహీం కుమారుడు ఫయాజ్ రంగంలోకి దిగారు. దీంతో ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉండగా, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ పాటిల్‌కు 74,945 ఓట్లు, బీజేపీ అభ్యర్థి సుభాష్ కల్లూర్‌కు 43,131 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థి నసీముద్దీన్ పటేల్‌కు 34,280 ఓట్లు వచ్చాయి.

- ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచిపట్టు ఉంది. వరుస విజయాలు సాధిస్తూ వస్తున్న రాజశేఖర్ పాటిల్‌కు ప్రజల్లో కూడా ఆదరణ ఉంది. ఇదే కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని తెచ్చిపెడుతోంది. 2008, 2013, 2018లో వరుస విజయాలను రాజశేఖర్ పాటిల్ అందుకున్నారు. మరోమారు ఈ గెలుపును నిలబెట్టుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. రాజశేఖర్ పాటిల్ తరపున రాహుల్ గాంధీ సైతం ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జేడీఎస్‌ల నుంచి గట్టి పోటీనే ఎదుర్కొంటున్నారు.
- ఈ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కూడా సవాలుగా తీసుకుంది. వరుస ఓటములను చవిచూస్తూ వచ్చిన సుభాష్ కల్లూర్ స్థానంలో కొత్త అభ్యర్థి సిద్ధు పాటిల్‌ను రంగంలోకి దింపింది. గెలుపు కోసం అన్ని విధాలుగా బీజేపీ ప్రయత్నిస్తోంది. సిద్ధుపాటిల్ తరపున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం ప్రచారం నిర్వహించారు.
- జేడీఎస్ సైతం గట్టి సవాల్‌నే విసురుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రహీం కుమారుడు రంగంలో ఉండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తోంది. ముస్లిం ఓట్లతో పాటు ఇతర సామాజిక వర్గాల ఓట్లను తమ వైపు తిప్పుకుని విజయం సాధించేలా పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో మాజీ మంత్రి మిరాజుద్దీన్ పటేల్ తమ్ముడు నసీముద్దీన్ పటేల్ జేడీఎస్ తరపున పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మాత్రం ఆమ్‌ఆద్మీ పార్టీ నుంచి బీదర్ దక్షిణ స్థానానికి మారి పోటీ చేస్తున్నారు.

తగ్గేదేలే..

- సమ్మె కొనసాగిస్తున్న జేపీఎస్‌లు
- విరమింపజేసేందుకు అధికారుల యత్నాలు
- విధుల్లో చేరకపోతే ఆ పోస్టింగ్‌లు మారుస్తామంటూ అధికారుల హెచ్చరికలు
- విధుల్లో చేరిన పటాన్‌చెరు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లు పట్టు వీడటం లేదు. ప్రభుత్వం తమ సర్వీసు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. జేపీఎస్‌లు తక్షణం సమ్మె విరమించి మంగళవారం సాయంత్రం ఐదు గంటలలోగా విధుల్లో చేరాలని., లేనిపక్షంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వ హెచ్చరికలకు ఏమాత్రం బెదరకుండా జేపీఎస్‌లు తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 427 మంది జేపీఎస్‌లు సమ్మెలో ఉన్నారు. వీరంత 12 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

విధుల్లో చేరకుంటే ఆ పోస్టింగ్‌లు ఉండవు..

రియల్ వ్యాపారం అధికంగా ఉండే గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టింగ్‌లకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ప్రధానంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పోస్టింగ్‌ల కోసం పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతుంటాయి. అక్రమ కట్టడాలు., ఇంటి నిర్మాణాలు, వెంచర్లు.. ఇలా వివిధ రకాల అనుమతుల వ్యవహారాల్లో ఈ ప్రాంతంలోకి కార్యదర్శుల పంట పండుతుంటుంది. జేపీఎస్‌లతో సమ్మె విరమింపజేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు దీన్ని ఒక అవకాశంగా తీసుకున్నారు. వెంటనే విధుల్లో చేరకపోతే ఈ ప్రాంతంలో నుంచి పోస్టింగ్‌లను మారుస్తామని మౌఖికంగా హెచ్చరించారు. అయినా ఎక్కడా జేపీఎస్‌లు సమ్మె విరమించలేదు. కానీ పటాన్‌చెరుతో పాటు, జిన్నారం, అమీన్‌పూర్ తదితర మండలాల్లో సుమారు 26 మంది జేపీఎస్‌లు సమ్మెను విరమించారు. తాము విధుల్లో చేరుతున్నట్లు లేఖలు అందజేశారని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై సమ్మె చేస్తున్న మిగతా ప్రాంతాల్లోని జేపీఎస్‌లు మండిపడుతున్నారు.

ఎంపీడీఓలతో ఒత్తిళ్లు..

జేపీఎస్‌ల సమ్మెను విరమింపజేసేందుకు జిల్లా అధికారులు అన్ని స్థాయిల్లో ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ శరత్ పలుమార్లు జేపీఎస్ఎఫ్ నాయకులతో మాట్లాడారు. మరోవైపు ఎంపీడీఓలను రంగంలోకి దింపారు. విధుల్లో చేరాలని వారికి ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు సమ్మె చేస్తున్న జేపీఎస్‌ల గ్రామ పంచాయతీల్లో పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సూపరిండెంట్‌లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

రెగ్యులర్ చేసే వరకు పోరాటం : నీరడి రాజు, జేపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

సర్వీసును రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేసే వరకు పోరాటం ఆపేది లేదు. రెండు సంవత్సరాల ప్రొబేషనరీ కాలపరిమితి ఉండగా.. ఇప్పటికే నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి. విధుల్లో చేరుతున్నట్టు లేఖ ఇచ్చిన పటాన్‌చెరు ప్రాంతం జేపీఎస్‌లో చర్చిస్తాం. వారిని కూడా తిరిగి సమ్మెలోకి వచ్చేలా చేస్తాం.

అంధకారంలో సంగారెడ్డి

- గంటల తరబడి నిలిచిపోయిన కరెంట్
- స్పందించని విద్యుత్ అధికారులు



అంధకారంలో సంగారెడ్డి చౌరస్తా

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మంగళవారం రాత్రి అంధకారం అలుముకుంది. ఉరుములు, మెరుపుల కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణ ప్రాంతవాసులతోపాటు, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం పోయిన కరెంటు రాత్రి 11 దాటినా రాలేదు. విద్యుత్ అధికారులకు ఫోన్లు చేస్తే కొందరి ఫోన్లు స్విచాఫ్ అని, మరికొందరి ఫోన్లు బిజీ టోన్లు వచ్చాయి.

వయోవృద్ధుల ఫిర్యాదుల వెబ్‌పోర్టల్ ప్రారంభం

నారాయణఖేడ్: ఆర్డీఓ కార్యాలయంలో వయోవృద్ధుల ఫిర్యాదుల వెబ్‌పోర్టల్‌ను మంగళవారం ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్‌రావు, జిల్లా వయోవృద్ధుల శాఖ ఎఫ్ఆర్ఓ సతీష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వెబ్‌పోర్టల్ తోపాటు సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ యాక్ట్‌లకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నిరాదరణకు గురైన తల్లిదండ్రులు, వయోవృద్ధులు పోషణ, సంరక్షణ చూడని పిల్లలపై వెబ్‌పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మీసేవ, మొబైల్‌లోనైనా ఫిర్యాదు చేసే అవకాశముందన్నారు. డీపీఓ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మంది వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున, ఇద్దరికి రూ.3వేలు, మరోకరికి రూ.5వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తికి చికిత్స

ఝరాసంగం(జహీరాబాద్): గుర్తుతెలియని వ్యక్తిని చేరదీసి చికిత్సఅందజేస్తున్న సంఘటన మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..మూడు రోజులు క్రితం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టు కింద పడుకొనిఉన్నాడు. ఇది గమనించిన ఆశ్రమ నిర్వాహకులు అతడిని విచారించగా సరైన సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో అతన్ని 108 అంబులెన్స్ ద్వారా జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను ఏమి మాట్లాడడం లేదు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే ఝరాసంగం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి..


భిక్షపతి మృతదేహం

నిజాంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కుంటలో పడి మృతి చెందిన సంఘటన నిజాంపేట మండల పరిధిలోని కలవకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కల్వకుంట గ్రామానికి చెందిన కమ్మరి బిక్షపతి(40) ఆదివారం మధ్యాహ్న సమయంలో గ్రామ శివారులో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికే క్రమంలో అవుసుల కుంటలో శవం అయ్యి తేలాడు. మృతుడు బిక్షపతి చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో జారి పడి నీటమునిగి చనిపోయినట్లు తెలిపారు. మృతుని తల్లి నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మర్రి శేరి కుంట వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..కుకునూరుపల్లి మండలంలోని చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులోని మర్రి శేరి కుంటలో మంగళవారం మృతదేహం ఉందనే సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. గ్రామస్థుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే 100కు లేదా 8712667345 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- బంధువుల రాస్తారోకో


ధరావత్ కోటా (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతు మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ వైర్లు తెగిపడడంతో వాటిని మరమ్మత్తులు చేయకపోవడం వల్లే తన పొలంలో తెగిపడిన విద్యుత్ వైరుతాకి మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు.

కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ధరావత్ కోటా(49)తనకున్న 6ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వరి చేను కోసేందుకు భార్య లక్ష్మితో పొలానికి వెళ్లాడు. అక్కడ పంటకోతకు అనువుగా ఉందా లేదా అని భార్యతో పొలంలోకి దిగి పొలాన్ని పరిశీలిస్తున్నాడు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ ఎల్‌టీ వైర్లు తెగి పొలంలోనే పడి ఉంది. దీన్ని గమనించని రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లపై కాలు పెట్టాడు. విద్యుత్ షాక్ తగిలి భార్య చూస్తుండగానే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని చేర్యాలకు తరలించారు.


మద్దూరు(హుస్నాబాద్): రోడ్డుపై ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

అధికారుల నిర్లక్ష్యమే మృతికి కారణం..

రైతు కోటా మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చేర్యాల రొడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రైతు మృతికి కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. మృతినికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద వైర్లను సరిచేయబోయి ..

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుదాఘాతినికి గురై కౌలు రైతు మృతి చెందిన సంఘటన చెర్లపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని శేరీల గ్రామానికి చెందిన గుర్రు నాగులు(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని చెర్లపల్లి పంచాయతీపరిధి వరదవానిచెరువుతండా సమీపంలో తనకున్న పొలంతో పాటు చుట్టుపక్కల మరికొందరి పొలాలను కౌలుకు తీసుకున్నాడు. తన పొలంలో పండిన వరిధాన్యాన్ని సమీపంలోనే ఓ బండపై ఆరబెట్టాడు. కౌలుకు తీసుకున్న భూమిలో కూరగాయల పంటలకు నీరు పెట్టడానికి మంగళవారం ఉదయం బోరుమోటార్ వద్దకు వెళ్లాడు. బోరుమోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో పక్కనే గల సింగిల్ ఫేజ్ మోటార్‌కు ఒక ఫేజ్ సరఫరా నిలిచిపోయినట్లు గుర్తించాడు. నీరు పెట్టకపోతే పంట దెబ్బతింటుందనే ఆలోచనలో సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద ఏబీ స్విచ్‌ను బంద్ చేసి తను మరమ్మతులు చేపట్టడానికి పూనుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్తంభం ఎక్కి సరిచేసే పనుల్లో నిమగ్నమయ్యాడు. విద్యుత్ వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. అటుగా రోడ్డుపై వెళ్తున్న ఇద్దరు యువకులు కర్రతో కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. రెప్పపాటులోనే ఉన్నచోటే హాహాకారాలు చేస్తూ మృతిచెందాడు. సంఘటనా స్థలం వద్ద మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


గుర్రు నాగులు మృతదేహం


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

ఉమ్మడిజిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

మద్యానికి బానిసై..


శ్రీరాములు(ఫైల్)

మెదక్ రూరల్: మద్యానికి బానిసై ఆత్మహ త్య చేసుకున్న సంఘటన హవేళిఘణాపూర్ మండల పరిధిలోని నాగాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వడ్ల శ్రీరాములు(40) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి శ్రీరాములు మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వైద్యులు ఇచ్చిన మందులు సరిగ్గా వేసుకోక, మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య విజయ 15రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం శ్రీరాములు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన మృతుడి సోదరుడు భార్య విజయకు సమాచారం అందజేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పటాన్‌చెరుటౌన్‌లో..


షాబుద్దీన్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన షాబుద్దీన్(25) సంగారెడ్డి పోస్ట్ ఆఫీసులో కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసై షాబుద్దీన్ మంగళవారం మధ్యాహ్నం ఇంటికొచ్చి భోజనం చేసినంతరం రూమ్‌లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. అనుమానం వచ్చిన సోదరుడు ఫకీర్‌ఉద్దీన్ డోర్ సందులోనుంచి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే లోనికి వెళ్లి షాబుద్దీన్ ఉరిని తొలగించాడు. అనంతరం చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో...


పరశురాములు (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పా ల్పడిన సంఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన మానేపల్లి పరశురాములు(37) అనే వ్యక్తి గ్రామంలో తాపీ మేస్త్రీగా పని చేస్తు కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో వరి పొలం సాగు చేశాడు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి పంట దెబ్బతినటంతో మనస్థాపం చెందాడు. దీంతో వ్యవసాయనికి, కుటుంబ పోషణకు చేసిన అప్పు ఎలాతీర్చాలో అర్థం కాక మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జనగామ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసపోయి..

గజ్వేల్‌రూరల్: ప్రేమపేరుతో మోసపోయిన యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వర్ష(20) ప్రైవేటుగా ఉద్యోగం చేస్తుంది. సిద్దిపేటకు చెందిన రవితేజతో పరిచయం ఏర్పడి 3ఏళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం 20రోజుల క్రితం వర్ష కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో ఇరువురు కుటుంబ సభ్యులు మాట్లాడుకోగా వర్షను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మొహం చాటేశాడు. మోసపోయానని గ్రహించిన వర్ష మనస్థాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే పోస్టులు పెడితే..పెట్రోల్ పోసి చంపుతారా?

ఫోన్‌లో బెదిరించినందుకు ఎస్పీకి ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పోస్టులు పెడితే చంపుతారా? పోస్టులు పెట్టడమే తాము చేసిన తప్పా? ఈ విషయమై ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిపై ఎమ్మెల్యే వర్గీయులు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం మెదక్ ఏఎంసీ డైరెక్టర్ సాప సాయిలు, పాపన్నపేట మండలం కుర్తివాడ సర్పంచ్ ప్రవంతి భర్త శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డికి సంబంధించి ఫొటోలు పోస్టు చేశామని తెలిపారు. ఈ విషయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎమ్మెల్యే పోస్టులు ఎందుకు పెడుతున్నారు. బతకాలని లేదా? పెట్రోల్ పోసి చంపుతామని బెదిరించినట్లు వారు తెలిపారు. అలాగే ఓ మహిళ కూడా ఫోన్‌చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని సాప సాయిలు పేర్కొన్నారు. కాగా తమకు వచ్చిన కాల్స్ మైనంపల్లి సోషల్ సర్వీస్ (ఎంఎస్ఎస్ఓ) ఆర్గనైజేషన్ సభ్యుల నుంచి వచ్చిన వేనని వారు ఆరోపించారు. తాము ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డికి అనుకూలంగా పోస్టులు పెడుతున్నామని ఈ విషయంలో మైనం పల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌కు చెందిన వారు తమను బెదిరిస్తున్నారని చెప్పారు. అర్ధ రాత్రి మహిళలతో ఫోన్ చేయించి బెదిరించడం బాధాకరమన్నారు. తమను బెదిరించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాపన్నపేట బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుబేరుడు, శ్రీనివాస్ రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, హవేలిఘణాపూర్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పిడుగు పాటుకు చెట్టు ధ్వంసం

నర్సాపూర్: పిడుగు పాటుకు ఓ చెట్టు ధ్వంసమైంది. మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పంబాల సర్వేశ్‌కు చెందిన పొలంలో చెట్టుపై పిడుగు పడడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా ఏళ్ల నాటి వేప చెట్టుపై పిడుగు పడడంతో చెట్టులో చీలిక వచ్చిందని ఆయన అన్నారు. పిడుగు పాటుకు స్థానికులు భయానికి లోనై పరుగులు తీశారన్నారు.

వదినను మోసగించిన మరిదికి 15 ఏళ్ల జైలు

పాపన్నపేట(మెదక్): వదినను మోసగించిన మరిదికి 15 ఏళ్ల జైలుశిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తు జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి పి. లక్ష్మీశారద తీర్పు చెప్పినట్లు జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాపన్నపేట మండలంలోని ఓ వివాహిత మహిళ భర్త యేడాదిన్నర క్రితం కరెంట్ షాక్‌తో చనిపోగా, ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి కుటుంబంలో కలిసి నివసిస్తున్న మరిది సురేశ్ ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే పెళ్లి చేసుకోమని కోరగా అతను ఒప్పుకోలేదు. దీంతో బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం న్యాయమూర్తి సురేశ్‌కు 15ఏళ్ల కారాగార శిక్షతోపాటు రూ.30వేల జరి మానా విధిస్తు తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో అడిషనల్ పిపి ప్రభు దాన్యం, మెదక్ రూరల్ సీఐలు రామకృష్ణ, విజయ్, లైజనింగ్ ఆఫీసర్ విఠల్, కానిస్టేబుల్ క్రిష్ణల కృషిని ఎస్పీ అభినందించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం


భవాని (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అదృశ్యమైన సంఘటన బానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు మండలం పాటీ గ్రామానికి చెందిన భవాని(18) మంగళవారం వచ్చిన ఇంటర్మీడియట్ ఫలితాలలో అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయింది. ఫలితాలు చూసుకొని ఇంటికొచ్చిన అనంతరం సోదరి లయతో కొద్దిసేపు బయటకు వెళ్లి వస్తానని చెప్పి భవాని తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద వెతికినా భవాని ఆచూకీ లభించలేదు. తన సోదరి ఇంటర్‌లో అన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయి డిప్రెషన్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనాపూర్‌లో దొంగల బీభత్సం

దుబ్బాక: దౌల్తాబాద్ మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఆలయాలే టార్గెట్‌గా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. సోమవారం అర్ధ రాత్రి సమయంలో మండల పరిధిలోని కోనాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో రెండు హుండీలను పగలగొట్టిన దొంగలు సుమారు రూ.30వేలు అపహరించినట్లు ఆలయ బాధ్యులు తెలిపారు. గత గురువారం రాత్రి మండల పరిధిలోని గోవిందాపూర్, కోనాయిపల్లి గ్రామాల్లో ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు హుండీలను పగలగొట్టి నగదు అపహరించిన విషయం తెలిసిందే. 5 రోజుల్లోనే దొంగలు మూడు ఆలయాల్లో చోరీకి పాల్పడడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిందితులను త్వరగా పట్టుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై ఎస్‌ఐని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బారులో గడువు తీరిన బీర్లు

రామాయంపేట: ఓ బార్ షాపులో గడువు తీరిన బీర్లు అమ్మకాలు జరిపిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మంగళవారం రాత్రి కొందరు యువకులు మద్యం తాగడానికి బార్‌కు వెళ్లారు. అక్కడ వారికి గడువు తీరిపోయిన బీర్లు ఇచ్చారు. 6-4-2023గా బీర్లపై ఉంది. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ జయసుధను వివరణ కోరగా బార్‌లో గడువు తీరిన బీర్లు అమ్ముతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కొల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. రంగంపేట గ్రామ శివారులో మంగళవారం బ్యాగరి నరేందర్ మేతకు ఎద్దులను వ్యవసాయ పొలంలోకి తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఎద్దులను అక్కడే తన పొలం వద్ద చెట్టుకు కట్టి ఇంటికొచ్చాడు. తిరిగి వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందింది.

ఆత్మహత్య యత్నం

దుబ్బాక: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన తూర్పు రవి(28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కిందికి దించి 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కర్నాటక ఎన్నికల నేపథ్యంలో హవాలా డబ్బు, మద్యం అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రయాణికుల బ్యాగ్‌లను పరిశీలించారు. తనిఖీల్లో డీఎస్పీ రఘు, సీఐ భూపతి, ఎస్‌ఐ శ్రీకాంత్ పోలీసులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

టేక్మాల్(మెదక్): హత్యకేసులో ఇద్దరికి జీవితఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధించినట్లు స్థానిక ఎస్‌ఐ రమేశ్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం..జనవరి 7, 2020 టేక్మాల్ శివారులో సాలోజిపల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలు హత్యకు గురయ్యాడు. మృతుడి భార్య వేముల నాగమణి ఫిర్యాదు మేరకు అప్పటి అల్లాదుర్గం సీఐ రవి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఏ1గా అదేగ్రామానికి చెందిన దండుగుల యాదయ్య, ఏ2గా మృతుడి భార్య వేముల నాగమణి విచారణలో తేలారు. తమ అవివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని వేముల సాయిలును హత్య చేసినట్లు వారు విచారణలో ఒప్పుకోగా మెదక్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు మేజిస్ట్రేట్ లక్ష్మీ శారద నిందితులిద్దరికి జీవితఖైదుతో పాటు రూ.10వేలు జరిమాన విధించినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పదమూడు మందికి గాయాలయ్యాయి

పదమూడు మందికి గాయాలు


రియాన్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నార్సింగి మండల కేంద్రానికి చెందిన రియాన్ (18)మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. రాత్రి రామాయంపేటలోని ఓ ఫంక్షన్‌హాలులో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొని రియాన్‌తోపాటు అతని స్నేహితుడు తన్వీర్ బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పక్కనుంచి వెలుతున్న కంటేయినర్ లారీ ఢీ కొనగా ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. రియాన్ తండ్రి గౌస్‌పాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుకుంటుండగా..

- బాలుని ఢీకొట్టిన కారు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి


మొహమ్మద్ అయాన్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటి ముందు మెట్లపై ఆడుకుంటున్న బాలుడిని కారు ఢీ కొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..పటాన్‌చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఖదీర్ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటిముందు ర్యాంపుపై తన ఇద్దరు పిల్లలు ఆడుకుంటుండగా పక్కనే పార్కింగ్‌లో ఉన్న కారును చిట్టిబాబు అనే వ్యక్తి అజాగ్రత్తగా తీశాడు. ఈ క్రమంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మూడున్నర సంవత్సరాల బాలుడు మొహమ్మద్ అయాన్‌ను ఢీకొట్టాడు. బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని..

హత్నూర(సంగారెడ్డి): ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ శివారులో జరిగింది. కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన కమ్మరి జస్వంత్ చారి(20) గత కొద్ది రోజులుగా చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీఆర్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 5గంటలకు పనినిమిత్తం ఇంటి నుంచి బయలుదేరాడు. గుండ్ల మాచునూర్ గ్రామ శివారులోకి చేరుకోగానే ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.


జస్వంత్ చారి మృతదేహం

స్కూటీని ఢీకొన్న కారు..

రామచంద్రాపురం(పటాన్ చెరు): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బండ్లగూడ ప్రాంతానికి చెందిన పాషామియా (26) ప్రైవేట్ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు తన స్కూటీపై వస్తుండగా జ్యోతినగర్ సమీపంలోని జాతీయ రహదారిపై ఓ కారు స్కూటీని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన పాషామియాను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

టిప్పర్‌ను తప్పించబోయి విద్యార్థికి ...

అక్కన్నపేట(హుస్నాబాద్): టిప్పర్‌ను తప్పించబోయి విద్యార్థికి గాయాలయిన సంఘటన గౌరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం..కుందనవానిపల్లి గ్రామానికి చెందిన శ్యాం పరీక్షలు రాసి హుస్నాబాద్ నుంచి ఇంటికి బైక్‌పై వెళ్లుతున్నాడు. ఈ క్రమంలో గౌరవెల్లిలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొనే క్రమంలో బైక్‌ను తప్పించబోయి బైక్‌పై నుంచి దూకాడు. ఈ ఘటనలో అతనికి స్వల్పగాయాలయ్యాయి. కాగా బైక్ నుజ్జునుజ్జయింది.

కారు బోల్తా..ముగ్గురికి..

కోహెడరూరల్(హుస్నాబాద్): అదుపుతప్పి కారు బోల్తా పడ్డ సంఘటనలో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హుస్నాబాద్ వైపు నుంచి సిద్దిపేటకు వస్తున్న కారు బస్వాపూర్ గ్రామ శివారులో లో లెవెల్ వంతెన పైనుంచి వాగులో బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి.

కార్మికుడికి...

పటాన్‌చెరు టౌన్: ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేసే చోట ప్రమాదం జరిగి కార్మికులకు తీవ్ర గాయాలైన సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బైద్యనాథ్ మహతో బతుకుదెరువు కోసం సంవత్సరం క్రితం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. పాటీ గ్రామ శివారులోని కనకయ్య ప్లాస్టిక్ గోదాంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ప్లాస్టిక్ రీసైకిలింగ్ చేసే మిషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైద్యనాథ్ మహతో ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కావడంతో బీరంగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నాసాగర్ వద్ద ఆటో, స్కూటీ ఢీ

ఇద్దరి పరిస్థితి విషమం

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని అన్నాసాగర్ శివారులోని దర్గా వద్ద ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో జోగిపేట వైపు టెంట్‌హౌస్ సామగ్రితో వెళుతున్న ట్రాలీ ఆటో, ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీకొనడంతో స్కూటీపై ఉన్న చింతకుంట గ్రామానికి చెందిన నరేష్, మల్లేశం, జోగిపేటలో కూరగాయలు విక్రయించే రాజు, ఈశ్వర్‌లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో నలుగురిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. . మల్లేశం నోట్లో నుంచి రక్తస్రావం జరగడంతో ఆయన పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. రాజు, ఈశ్వర్‌లకు కూడా బలమైన గాయాలు అయ్యాయి. నరేష్ కాలుకు కూడా ఇతర చోట్ల గాయాలు కావడంతో రెండు అంబులెన్స్‌లలో నలుగురిని మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఒకే స్కూటీపై నలుగురు వెళ్లారా? లేక రోడ్డుపై వెళుతున్న వారికి ఢీకొట్టారా అన్న విషయం తేలాల్సి ఉంది. నరేష్, మల్లేశంలు జోగిపేటలోని బ్యాంగిల్ షాప్‌లో పనిచేస్తారని తెలిసింది. జోగిపేట పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.


అన్నాసాగర్ వద్ద ఆటో, స్కూటీ ఢీకొన్న దృశ్యం


గాయపడిన మల్లేశం, రాజు

డాంబర్ రోలర్‌ను ఢీకొన్న ఆటో..

చిన్నశంకరంపేట(మెదక్): డాంబర్ రోలర్‌ను ఆటో ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన చిన్న శంకరంపేట మండల పరిధి అంబాజీపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అంబాజీపేటలో డాంబర్ రోడ్డు పనులు నిర్వహిస్తున్న క్రమంలో శంకరంపేట నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఆటో రోలర్‌ను ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబాజీపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


రోలర్‌ను ఢీకొన్న ఆటో